# ఎవరు దొంగ?

అవును! ఎవరు దొంగ?

ఇన్కమ్‌టాక్సు వాళ్ళకి చూపించే ఎకౌంటు ఒకటీ, తోటి వాటాదార్లకి చూపించేది ఇంకోటీ, అసలు పరిస్థితి ఏవిటో తనకి మాత్రమే అర్థం అయేలా తయారు చేసింది మరోటీ. ఇలా ఓకే వ్యాపారానికి సవాలక్ష దొంగ ఎకౌంట్లు రాయించే పురుషోత్తమ సెట్టా, లేక. కొట్టించని బోరింగు సెట్టుకి సబ్సిడీ, వెయ్యని ఖరీఫ్ పంటకి ధన సహాయం తుఫాను నష్టం తగలని ఆస్తికి తుఫాను నిధిలాగి కొడుకు చదువు దగ్గరికొచ్చేసరికి బీద విద్యార్థుల స్కాలర్‌షిప్పుకి ప్రాకులాడే భూస్వామి కృష్ణయ్య చౌదరా, లేక, న్యాయంగా మంజూరు చెయ్యవలసిన డబ్బు మంజూరు చెయ్యకుండా, అలక్ష్యానికి తట్టుకోలేక పరిగెట్టుకుంటూ వచ్చిన అమాయక ప్రజలనుండి పాతికా ఏభయ్యో గుంజే ఆఫీసరు మోహనరెడ్డా, లేక, ఖరీదైన ముహూర్తాలూ

చవకైన మహాస్త్రాలూ అంటూ రెండు రకాల మహాస్త్రాల్ని అమ్ముతూ కష్టాల్లోవున్న మనుష్యుల్ని గ్రహశాంతులనీ, అభిషేకాలనీ భయపెట్టి ఏడాదికో ఎకరం కొంటూన్న వీరభద్రశాస్త్రి. లేక, క్లాసులో పాఠాలు చెప్పక అర్థంకాక పోతే ఇంటికి రండి అని ఇంటిదగ్గర ప్రైవేటు దుకాణాలు ప్రారంభించి వెయ్యి తర్వాత వెయ్యి జేరుస్తూన్న కుటుంబం మేష్టారా, లేక, వరసగా వీళ్ళ అందరి ఇళ్ళల్లోనూ రోజుకో చోట చొప్పున ఇవాల్టికి దాదాపు నాలుగైదు రోజులనుంచి విజయవంతమైన దొంగతనాలు చేస్తూ పేట పేటంతనీ హడలు గొట్టేస్తూన్న ఆ అర్థరాత్రి అతిథా!

ఇందులో ఎవరు దొంగ?

సంఘంలో ఉన్నవాళ్ళ అందరికళ్ళూ కప్పి వీళ్ళు కాజేస్తుంటే వీళ్ళ కళ్ళుకప్పి వాడు కాజేస్తున్నాడు! అంటే అందర్నీ అనాలి. "వాణ్ణి ఒక్కణ్ణే అనడం ఏం భావ్యం?"

ఇలా ఆలోచిస్తూ, ఇంకా పక్కమీంచి లేవకుండా కిటికీలోంచి ఆకాశంలోకి చూస్తున్నా, ఎర్రటోపీ సూర్యుణ్ణి చూసి పారిపోతూన్న దొంగల్లా నక్షత్రాలు ఉన్నట్టుండి తమాషాగా మాయం అవుతున్నాయి.

ఇంతలో కిందనుంచి అమ్మపెట్టిన నెత్తికేక ఒకటి వినిపించింది...కంగారుగా మేడదిగి చూస్తే కనిపించింది కాళీగా వున్న వంటిల్లూ, ఆ వంటింటి మధ్యలో కాళ్ళు జాపుకుని ఏడుస్తూ కూర్చున్న అమ్మాను. నన్ను చూస్తూనే "నాయనోయ్! మన కొంప మునిగిపోయింది...ఆ శనిగాడు ఇవాళ

మన ఇంటికి వేశాడు...గోడకి జారేసిన వెండి కంచాలూ దేవుడిగూట్లో వెండి కుందులూ కనిపించడంలేదు రోయ్." అంటూ ఒకటే శోకం మొదలెట్టింది.

నా గుండె గతుక్కుమంది. ఎప్పుడో నాన్నగారి హయాములో పాతిక ముప్పైయేళ్ళ క్రితం అసలు చాదీ వెండితో చేయించిన కంచాలూ, కుందులూను. ఇప్పుడు ఎంత లేదన్నా వెయ్యి రూపాయలుంటాయి! రోజూ అందరి ఇళ్ళల్లోనూ వందలతో పోనిస్తూన్న ఆ దొంగ, ఇవాళ మాయింట్లో వెయ్యికి వేశాడు ... వెయ్యి రూపాయలు! అమ్మో - వెయ్యి రూపాయలే!

"కంచాలమీద చెక్కిన మీ నాన్నగారి పేరు ఎలా మిలమిలా మెరిసిపోతూ ఉండేదీ!...వాడిచేతులు పడిపోను. వాడు దేవుడి గూడుకూడా ముట్టుకున్నాడ్రోయ్!... ఏం కులంవాడో ఏం ఖర్మో! గూడు మైలబడిపోయింది" అంటూ అమ్మ దీర్ఘాలు మొదలెట్టింది.

"ఊరుకోవే" అని నేనో పక్కనుంచి అంటూనే ఉన్నాను.

అమ్మ అరుపులు విని చుట్టుపక్కల వాళ్ళంతా పోగడ్డారు. ఒక్కొక్కళ్ళే మళ్ళీ మళ్ళీ అడుగుతూంటే మనిషి మనిషికీ చెప్పిందే చెబుతోంది అమ్మ. వాళ్ళుపైకి సానుభూతి చూపిస్తూన్నట్లు కనిపించినా, మనస్సులలో వాళ్ళకేదో హమ్మయ్యా అని పెద్ద భారందిగి సంతృప్తిగా ఉన్నట్లూ, పొంగి పొరలి వస్తూన్న సంతోషాన్ని అతి ప్రయత్నంమీద

వాళ్లు అపుకుంటున్నట్లూ నాకు అనుమానం వేసింది. పైగా వాళ్ళ మాటల్లోకూడా నాకు సానుభూతేం కనిపించలేదు...

"వాడెవడో ఈ పేట అనుపానులు తెలిసిన వాడే నమ్మా" అని పురుషోత్తమసెట్టి అంటే, "అయినా రోజూ చుట్టుపక్కల ఇళ్ళల్లో దొంగతనాలు జరుగుతున్నాయి కదా మేడమీదకి పోయి పడుకోపోతే యేం?" అంది ఒక ఇల్లాలు.

"అదికూడా చూడు, వంటింట్లో వెండి కంచాలు వదిలేసి" అన్నాడు వీరభద్రశాస్త్రి ముక్కులోకి నస్యం దట్టిస్తూ.

"అయినా వెండి కంచాలు గోడకు జేర్లేసి వదిలేస్తారా. ఏ గాడ్రెజ్ బీరువాలోనో వేసి దాచుకోవాలి కాని" అంది చౌదరి గారి భార్య కాసులుపేరు సవరించుకుంటూ.

"అ...ఏవిటో...గాడ్రెజ్ బీరువాలు ఆగుతాయా? నా కరెన్సీ నోట్ల కట్టలు రెండూ గాడ్రెజ్ బీరువాలోనే కదూపోత?" అన్నాడు కుటుంబం మాష్టారు.

"అవును ఇంతకీ దొరికాయా?" అంది ఓ ముసిలావిడ.

"పోయిన వస్తువులు దొరుకుతాయా నీ పిచ్చిగాని? పైగా పోలీసుల సహాయం ఉండనే ఉంటుంది. ఎల్లప్పుడూ హమేషాగా ఇప్పటికీ పేటలో పోయినవేవీ దొరకలేదు, నా సింహ తలాటాలతో సహా...అలాగే వీళ్ళ కంచాలూను.

దొరికేదేవిటి ? అది సరే రేపెవరింట్లోనో ఈ ముచ్చట, మళ్ళీ!...రండి రండి..." అంటూ వీరభద్రశాస్త్రి వెళ్ళి పోయాడు.

నాకు వళ్ళు మండిపోయింది...'దొరకవ్ ? ఎందుకు దొరకవో చూస్తాను.' అంటూ కోపంతోనే పోలీస్ స్టేషన్ కి వెళ్ళి రిపోర్టు యిచ్చి వచ్చాను. సర్కిల్ ఇన్ స్పెక్టర్ నేను చెప్పిందంతా సావధానంగా విని, నాతో పాటు ఒక హెడ్ కానిస్టేబుల్ ని, ఇద్దరు కానిస్టేబుల్స్ ని పంపించాడు. వాళ్ళు అరగంట నన్నూ మా అమ్మనీ ప్రశ్నలతో వేధించి, వంటింట్లోనూ చుట్టు ప్రక్కలా అంతా చూసి, ఏవేవో రాసుకుని, మూడు రూపాయలు నాదగ్గర కాఫీ కని తీసుకుని వెళ్ళారు.

వారం అయింది...పదిరోజులయింది ... పోలీసుస్టేష న్ కి - ఇంటికీ మధ్యన నా కాళ్ళరిగి పోతున్నాయి. పోలీసు వారికి నామీద విసుగు పెరిగిపోతోంది రోజూవస్తున్నానని చుట్టుప్రక్కల వాళ్ళకి నామీద జాలి హెచ్చిపోతోంది. 'అయ్యో పాపం' అని - దొంగలజాడ తెలియనే లేదు.

ఒక రోజున అర్జున విషాదయోగంలో అర్జుని డీలా దిగాలుపడి కూర్చున్న నన్ను చూచి, మా ఇంటికొచ్చిన ఒక చుట్టం. నా విషాదం అంతా విని, ఎవరికీ తెలియని ఒక చక్కని హితోపదేశం చేశాడు. ఆయన సలహా ప్రకారం ఆ మర్నాడే డి. యస్. పి. కి రిజిస్టర్ పోస్టులో సర్కిల్ ఇన్ స్పెక్టరుకి లోగడ యిచ్చిన రిపోర్టు కాపీ ఒకటి పంపాను.

ఆ తర్వాత పదిహేను రోజులికి ఓ రోజు సాయంత్రం కానిస్టేబుల్ వచ్చి 'మిమ్మల్ని అర్జెంటుగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గారు రమ్మంటున్నారు.' అని కబురు చెప్పాడు. "హమ్మయ్య! మా కంచాలూ కుందులూ దొరికినట్లున్నాయి" అని సంతోషంతో స్టేషన్‌కి వెడితే, సర్కిల్ ఇన్‌స్పెక్టరుగారు దోషివైపు చూసినట్లు నావైపు కొరాకొరా చూసి "నాకు చెప్పకుండా మీరు డి. యస్. పి. కి ఎందుకు రిపోర్టు పంపించారు?" అన్నాడు. నేను తప్పుచేసినవాడిలా తల వంచుకున్నాను.

"మీరు చేసిన ఘనకార్యానికి మాకు ఇంక పైనుంచి వారం వారం ఒక రిమైండరు" అన్నాడు విసుగ్గా. నేనేం మాట్లాడలేదు. ఆ తర్వాత ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌ని "వీరి వ్యవహారం ఏదో కొంచెంగట్టిగా చూడు ఇక ముందైనా..." అన్నాడు.

'అంటే ... ఇప్పటిదాకా ...?' అని నోటిదాకా వచ్చి కూడా ఊరుకున్నాను.

ఆ తర్వాత పోలీసు డిపార్టుమెంటువారు మా కంచాల చోరీ విషయంలో నిజమైన శ్రద్ధ వహించడం ప్రారంభించారు. సబ్ ఇనస్పెక్టరూ, పోలీసులూ తరుచు మాయింటికి వస్తూ ఉండటం, నేను రోజు మొత్తంలో ఒకటి రెండుసార్లు అయినాపోలీసు స్టేషన్‌కి వెళ్ళవలసిన అవసరం ఏర్పడడం జరగసాగింది. వాళ్ళకీ నాకూ ఎంత స్నేహం కలిసిపోయిం దంటే, నన్ను వాళ్ళల్లో ఒక మనిషిగా చూడసాగారు.

వాళ్ళ కష్టసుఖాలు నాతో చెప్పుకో సాగారు. ఎన్ని మాట్లు హోటల్ కి కలిసి వెళ్ళినా అన్నిమాట్లూ, నన్నే బిల్లు ఇవ్వనిచ్చేవారు.

రోజులూ వారాలూ గడిచిపోతున్నాయి....మాకోసం అని కేటాయించబడ్డ సబ్ ఇన్స్పెక్టరు నానా హైరానపడసాగాడు. దొరికిన ప్రతి దొంగనీ స్టేషనులో ఉన్న సెల్ లో పడేయడం. ఓ రోజూరోజల్లా మాటలతో బెదిరిస్తూ, లాఠీలతో బాదుస్తూ 'ఫలానా కంచాల దొంగతనం చేశావా లేదా? అంటూ దబాయించడం - వాడీ హింస భరించలేక. అలాగని అంగీకరించి జైల్లో పడి, రోజూవచ్చే సంపాదనని పోగొట్టుకోవడం ఇష్టమూ లేక, ఇనస్పెక్టర్నీ, పోలీసుల్నీ బతిమాలుకుని డిపార్ట్మెంటుకి తన సంపాదనలోంచి, పదో పాతికో సమర్పించుకొని బతుకుజీవుడాఅని బయటపడ్డం - ఇలా జరిగిపోసాగింది.

రోజులు గడుస్తున్నాయి. కాని మాకంచాలు దొరికే ఎత్తు కనిపించడంలేదు. ఇప్పటికి అప్పుడే పోలీసుల ఖర్చులకనీ కాఫీలకనీ, పాతిక ముప్పై రూపాయలపైన దాటింది.

నాకో రోజున వళ్ళుమండి సర్కిల్ ఇనస్పెక్టర్ని కలుసుకుని "ఇంతమంది దొంగల్ని పట్టుకుంటున్నారు కాని మా కంచాల దొంగని మాత్రం మీ పోలీసులు పట్టుకోలేక పోతున్నారు" అన్నాను వ్యంగ్యంగా.

ఆయన చిత్రంగా నవ్వి "పట్టుకోకేం" అన్నారు.

నేను ఆశ్చర్యంగా "ఏవిటి? పట్టుకున్నారా?" అన్నా.

"ప్రతి దొంగనీ పట్టుకున్నప్పుడల్లా కొంచెం కొంచెం పట్టుకున్నట్లు అవుతోంది మీ దొంగని.

"అంటే ?"

"మీ దొంగని పట్టుకోడానికి పిళ్ళంతా చందా వేస్తున్నారు. ఇంకా డబ్బా నిండలేదు. నిండిన రోజున మీ దొంగ దొరికినట్లే" అన్నారు శర్మ గర్భంగా.

అంతా తికమకగా ఉండి అర్థంకాక తెల్లబోయి చూశా.

"మీకు అర్థం కాదులెండి!" అన్నారు ఆయన నవ్వుతూ.

నిజానికి అప్పట్లో అయితే నాకు అర్థంకాలేదు కాని ఆ తర్వాత అర్థం అయింది. రోజుకో చిన్న దొంగని ఇలా పట్టుకుని హింసించడంవల్ల, వాడు పదో పాతికో డిపార్ట్‌మెంట్ కి సమర్పించుకుంటూ ఉండేవాడు. అలా రోజూ డిపార్టుమెంటు సంపాదించిన సొమ్మంతా ఓచోట చేర్చేసరికి నాలుగైదు వందలదాక అయింది. ఆ తర్వాత సబ్ ఇన్ స్పెక్టరు విశ్వాస పాత్రుడైన ఒక పాత కె. డి. ని పట్టుకుని, ఆ డబ్బు వాడి చేతిలో పెట్టి "ఒరేయి కంచాలు దొంగతనం చేసింది నువ్వే అనీ, ఆ కంచాలు ఫలానా షావుకారు కొట్లో అమ్మేసి ఈ నాలుగైదు వందలూ తీసుకున్నావనీ మాకు ఆచూకీ వచ్చిందిరా....ఏమంటావు?.... నిజమే అంటావా?" అన్నాడు.

"సిత్తం బాబయ్యా....మీరు ఎలా అనమంటే అలాగే అంటాను. కాని నాకు మాత్రం ఆరు నెలలకి తక్కువ కాకుండ జైలు వేయించాలి. మళ్ళీ రెండు నెలలకీ మూడు నెలలకీ బయటికివచ్చి బువ్వ వెతుక్కోమంటే నాకు శానా సిక్కైపోతాది"-అన్నాడా పాత కె. డి.

దాంతో, తక్కిన దొంగలంతా కలిసి నా కంచాల దొంగకి చందాలు వెయ్యడం అంటే ఏమిటో అర్థంఅయింది. అర్థం అయింది కాని, ఆ పద్ధతీ విధానం అంతా చూసే సరికి మతిపోయి మనస్సంతా చికాకుగా అయిపోయింది.

నాకేం అర్థం కాలేదనుకొని కాబోలు మర్నాడు సర్కిల్ ఇనస్పెక్టరు నాతో "మీరు అదృష్టవంతులండీ - దొంగ దొరికాడు. కానయితే వాడిదగ్గర చోరీ ఆస్థి, సరుకు రూపంలో లేదు. కేష్ రూపంలో ఉంది. దానికేంలెండి: వాడు ఫలానా షాపుల్లో అమ్మేడుట మీ కంచాల్ని - అలా దొంగ సరుకుల్ని కొనేవాళ్లు, వాళ్ళ ధర్మమా అంటూ ఉన్నారు కనక కానీ, లేకపోతే ఈ ముష్టి దొంగవెధవల దగ్గర్నుంచి మనం ఏం రాబట్టగలం? వీళ్ళకోపూట తిండి ఉంటే రెండోపూట ఉండదు" అంటూ హ...హ...హ... అంటూ నవ్వారు. నాకు అందులో నవ్వవలసింది ఏముందో అర్థంకాలేదు. అయినా మర్యాదకోసం నేనూ నవ్వాను.

మర్నాడు వెండికొట్టుకి కె. డి. తో పాటు నన్ను కూడా తీసికెళ్ళారు పోలీసులు. సబ్ ఇనస్పెక్టర్నీ పోలీసుల్నీ చూసి గజగజా వణికిపోతూన్న షావుకార్ని "ఏవయ్యా!

దొంగ వస్తువుల్ని కొంటే నేరం అని తెలుసా ?" అని దబాయించాడు సబ్ ఇనస్పెక్టర్. షావుకారు బిత్తర చూపులు చూస్తూ నోటమాట లేకుండా ఉండిపోయాడు.

—వెంటనే ఇనస్పెక్టరు కె. డి. కేసి తిరిగి "ఏరా దొంగ కంచాలూ, కుందులూ అమ్మింది ఈయనకేనా?" అన్నాడు. వాడు తలవంచుకొని మొహమాట పడుతూ "సిత్తం" అన్నాడు.

అది విని షావుకారు అదిరిపడి "అయ్యల్లో ఇది అన్నేయం - నేను దొంగ వస్తువులు ఎప్పుడూ కొనలేదు. ఈ అబ్బాయి నాకు అమ్మడం అబద్ధం - ఆ మాటకొస్తే ఈ అబ్బాయిని నేనెప్పుడూ చూడనేలేదు" అంటూ అరిచాడు.

కె. డి. నిస్సహాయంగా ఇది నా తప్పుకాదన్నట్లు షావుకారుకేసి చూసి, వెంటనే తలదించేసుకున్నాడు.

సబ్ ఇనస్పెక్టరు ఇదిగో చూడు షావుకారూ! కాదని అల్లరిచేసి ఎందుకు ఇబ్బందిలో పడతావ్ ? మళ్ళీ కోర్టులూ, సాక్ష్యాలూ, జైళ్ళూ బోల్డు తతంగం అవుతుంది, డబ్బ ఏడెనిమిది వందలు వదులుతుంది. అందువల్ల నేనో ఉపాయము చెబుతాను విను" అంటూ వ్యాపార సరళిలో సంభాషణ ప్రారంభించాడు.

"చెప్పండి...తప్పుకుండా?" అన్నట్లు బిక్క మొహం వేసుకొని షావుకారు చూశాడు.

"పోయిన సరుకులు ఏరివి, ఆసరుకులులాంటివి నీకొట్లోంచి మీరు ఏరుకుంటారు...ఊఁ... ఏరుకోండి అలా చూస్తారేం?" అన్నాడు సబ్ ఇన్స్పెక్టరు...

"ఏమిటీదంతా...నాకేం అర్థం కావడంలేదు" అన్నా.

"ఇందులో అర్థం కావడానికేం ఉంది? మీ సరుకులు పోయాయి. అవి మళ్ళీ మీకు ఏదో రూపంలో చేరాలి. అందుకోసం చేస్తున్న ప్రయత్నం ఇదంతా"

నేను ఇంకా తటపటాయిస్తూనే ఉన్నా.

"ఏమిటండీ ఇంకా ఆలోచన? మీకు ఇంతకేమీ కంచాలూ కుండులూ రావాలని ఉందా లేదా?" అని విసుక్కున్నాడు సబ్ ఇన్స్పెక్టరు.

నేను వెంటనే కంగరుగా "ఎందుకులేదూ?" అంటూ కొంచెం ఇంచుమించు మా కంచాలులాగా, కుండులులాగా కనిపించిన వాటిని ఏరానుకొట్లోంచి, వాటి ఖరీదు కట్టిస్తే ఏడు వందల రూపాయలదాకా తేలింది.

"సరే...షావుకారూ!.. ఇవీ పోయిన వస్తువులు... ఇటువంటి దొంగవస్తువులు కొన్నందుకు సగంసొమ్ము నువ్వు వప్పపో...తక్కిన సగం సొమ్మూ ఈ కె. డి. ఇస్తాడు. ఇవ్వరా...ఇవి మరీ కొత్తగా మెరిసి పోతున్నాయి. ఏమిటి ఖర్మ! వీటిని కొంచెం పాతవాటిగా చెయ్యి! మీ కంచాలకీ వాటికీ సొట్టలు ఎక్కడున్నాయో పేర్లు ఎక్కడున్నాయో చెప్పి ఆ సొట్టలూ పేర్లూ వేయించుకోండి ... ఊఁ ... ఆ కంచాల్నీ కుండుల్నీ నీ గుడ్డల్లో మూట కట్టుకో రా...వస్తాం షావురుకారూ! చెప్పినట్లు విని మాతో సహకరించినందుకు

థేంక్స్... ఇంక ఎప్పుడూ ఇలాంటి దొంగవస్తువులు కొనబోకూ..." అంటూ అద్భుతమైన రాజకీయ చాతుర్యాన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టరు సలహా ప్రకారం తు. చ. తప్పకుండా ప్రదర్శించి మర్నాడు కోర్టుకి రావలసిందిగా నాకు ఆదేశం ఇచ్చాడు సబ్ ఇన్‌స్పెక్టరు.

"ఈ కంచాల్నీ, కుందుల్నీ వారి ఇంట్లో దొంగిలించా" నని కోర్టులో ఆ కె. డి. చెబుతున్నప్పుడూ, బోనులో నిలబడి ఈ కంచాలూ, కుందులూ, మావే అని నేను ప్రమాణం చేసి గుర్తు పడుతున్నప్పుడూ నా వెన్నులో కలుక్కుమన్నట్లనిపించింది.

సాక్ష్యాలూ, వాయిదాలూ, విచారణలూ, వగైరా కర్మకాండ విస్తారం అవసరం లేకుండానే మేజిస్ట్రేటుగారు ఆ కె.డి.కి మూడు నెలలు కారాగార శిక్షవిధించి, నా వస్తువుల్ని నేను పట్టికెళ్ళడానికి నాలుగు రోజుల తర్వాత రావచ్చని చెప్పారు.

ఆశించిన ఆరు నెలలూ పడలేదు మొర్రో అని ఏడుస్తూన్న కె. డి. ని ఓదార్చి, "వాడి ధర్మమా అని ఒప్పుకున్నాడు కనక మీ సరుకూ మీకు దొరికింది. మాకు ప్రాసిక్యూషనూ, సాక్ష్యం వగైరా ఇబ్బందీ తప్పింది. పాపం మూడు నెలలే పడిందని ఏడుస్తున్నాడు. మన కోసం ఇంత త్యాగం చేసిన ఈ వెర్రివాగుల వాడికో పది రూపాయలు ఇవ్వండి; జైల్లో ఖర్చులకుంటాయి" అంటూ నన్ను ఒప్పించి పది రూపాయలు వాడికి ఇప్పించాడు సర్కిల్ ఇన్‌స్పెక్టరు.

ఆ తర్వాత ఓ రోజున కోర్టునుంచి నా సరుకులు నేను స్వాధీనం చేసుకోవడం కోసం వెళుతూ ఉండగా ఎవరో అన్నారు "కంచాలదొంగ నెవర్నో పోలీసులు పట్టుకున్నా" రని - నేను కోర్టుకు వెళ్ళడం మాని పోలీసు స్టేషన్‌కి పరిగెట్టాను. నా రాక ఏం ఇబ్బంది కలిగించిందో ఏమో నేనలా రావడం ఇష్టం లేదన్నట్లు మొహంపెట్టి 'ఇలా వచ్చారేం'? అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్.

"అహా....కంచాల దొంగఎవరో దొరికాడంటేనూ...." అంటూ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గారి టేబిల్ మీద ఉన్న కంచాల్నీ, కుందుల్నీ చూసి ప్రాణం లేచి వచ్చినట్లయి "అయ్యా! నిజంగాఇవిమావి. ఇవి అచ్చమైన చాదీ వెండివి. అవి చేతవెండితో తయారైన రేకువి.... ఖరీదులోకూడా సగానికి సగం తేడా ఉంటుంది" అన్నా గబగబా....

"అయితే....ఇంతకీ ఏవంటారు?" అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టరు విశితంగా నాకళ్ళల్లోకిచూస్తూ.

"అహా....ఇవిమావి అంటూన్నా" అన్నా ఆపుకో లేని ఆనందంతో.

"ఇదిగో ఇలా చూడండి మిష్టర్: ఇవి మీవేకా వచ్చు. కాని నిండుకోర్టులో అవి మీవని ప్రమాణంచేసి ఒప్పుకున్నారు. ఇప్పుడు అలా కాదు. ఇవే మీవి అన్నా రంటే, మీవికాని వస్తువుల్ని కాజెయ్యడంకోసం మీరు ఇంత క్రితం అబద్ధం చెప్పారనీ, కోర్టువారిని మోసగించారనీ. కాని వస్తువుల్ని కాజెయ్యడం అనే దొంగపనికి మీరు

పూనుకొన్నారనీ మీామీద కొత్తగా కేసు పెట్టవలసి వస్తుంది" అన్నాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ సీరియస్‌గా—

నోటమాటలేక నేను ఆ మట్టునే ఉండి పోయాను.

—లేనిపోని కొత్త చిక్కుల్లో పడక తిన్నగా వెళ్ళి కోర్టునుంచి ఆ వస్తువులు తీసుకోండి. మేం ఈ వస్తువుల్నీ ఈ దొంగనీ ఇంకో కేసులో వాడుకుంటాము" అని సర్కిల్ ఇన్స్పెక్టరు అంటూండగా—

"బాబయ్యా!... వీరి ఇంటిలో ఈ కంచాలు కొట్టేసింది నేను ఒక్కణ్ణే కాదు... ఇంకా ఇద్దరం ఉన్నాం" అన్నాడు అక్కడ నిలబడిన దొంగ.

"వాళ్ళనీ పట్టుకుంటారా ...?" వాళ్ళ ఆచూకీ నువ్వు ఇద్దువుగాని ... కాని ముగ్గుర్నీ ఒక్క కేసులోనే ఎందుకు? అసలే దొంగలు దొరక్క ఛస్తున్నాం. ముగ్గురూ అయితే యింకా మంచిది! మూడు కేసుల్లో ఉపయోగించుకోవచ్చు...ఊ... ఇంక మీారు వెళ్ళొచ్చు మిష్టర్" అన్నాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉత్సాహంతో.

ఎంతో నిరుత్సాహంగా కోర్టుకు వెళ్ళి, ఆ కంచాల్నీ కుందుల్నీ తీసుకుని నీరసంగా ఇంటికి వచ్చా - వచ్చి, లేని సంతోషాన్ని తెచ్చుకుని, చూశావా అమ్మా....ఆ వీరభద్ర శాస్త్రి వాళ్ళూ ఇంకేందొరుకుతాయి కంచాలు అన్నారు.... చివరికి ఎలా సాధించి తెచ్చానో" అంటూ తీరాగర్వంగా అమ్మకి చూపించబోతే. అమ్మ వాటిని అటూ యిటూ తిప్పి

చూసి "ఇదేవిటిరా. నీ మొహం....ఇవి మనవికావు" అంది చటుక్కున.

నాకు భలే కోపం వచ్చింది.

"మనవే లేవే. నీకు తెలియదు" అన్నా -

"చాల్లే .... ఎవరివో తెచ్చి మనవి అంటావేమిటి" అంటూ నా వేపు అనుమానంగా చూసింది.

ఆ చూపులో దొంగ మాటలు చెప్తావేం. ఎవరివో దొంగ వస్తువులు పట్టుకొచ్చి" అన్న భావం చెళ్ళున వచ్చి నాకు తగిలింది. సిగ్గుతో వళ్ళంతా కుంచించుకు పోయింది. అమ్మదృష్టిలో "నేనుదొంగనా ?" ...ఏమో...కావచ్చు... అమ్మ దృష్టిలో నేను దొంగనైతే, మరి నా దృష్టిలో "సర్కిల్ ఇన్స్పెక్టరు దొంగా ?" ఆయన దృష్టిలో నాకంచాలు దొంగిలించకుండానే శిక్షను అనుభవిస్తూన్న, ఆ పాత కె.డి. దొంగా ? వాడి దృష్టిలో నేనూ. పురుషోత్తముసెట్టీ, కృష్ణయ్యచౌదరీ, మోహానరెడ్డి వీరభద్ర శాస్త్రీ, కుటుంబం మేష్టారూ, ఆ మాటకొస్తే మర్యాదస్థులుగా సంఘంలో చలామణీ అవుతూన్న పెద్దలం మేం అందరం కూడా దొంగలమేనా ?

ఏమో....అంతా అయోమయంగా ఉంది.

ఇంతమంది పెద్దలం మనం దొంగలం ఏమిటి అని ఏ ఘరానా మనిషి అయినా నిలబెట్టి అడిగితే మాత్రం

నాకు మళ్ళీ తిరిగి తిరిగి మొదటి అనుమానమే వచ్చేలాగ ఉంది.

ఎవరు దొంగ ?

అని——